### దటీజ్ తెలంగాణ

పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా నిలిచింది. 9 ఏండ్ల వ్యవధిలో రాష్ట్రానికి 23 వేలకు పైగా పరిశ్రమలు క్యూకట్టాయి. దీంతో 22.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్, ఫార్మా కంపెనీలు మన దేశంలో తమ శాఖలను ప్రారంభించేందుకు పరిశీలిస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ టాప్ త్రీలో ఉన్నది.



సంక్షేమం

### ఇల వైకుంఠం.. యాదగిరిగుట్ట

ప్రపంచ ప్రఖ్యాత తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని అద్భుతంగా తీర్చిదిద్దింది సర్కారు. భక్తుల సౌకర్యార్థం 1600 ఎకరాల్లో ఉద్యాన వనాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, విల్లాలు, కాటేజీలు నిర్మించింది.యాదగిరిగుట్ట క్షేత్ర అభివృద్ధితో తెలంగాణ పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతున్నది.

షాట్-బై-షాట్

# తెలంగాణ ఆత్మ.. హైదరాబాద్

**రెండో రాజధాని పేరుతో కాంగ్రెస్, బీజేపీ కుట్రలు**



*తెలంగాణ ప్రజలారా జాగ్రత్త. 58 ఏండ్ల పాటు అలుపెరుగకుండా పోరాడి దక్కించుకున్న హైదరాబాద్‌తో కూడిన తెలంగాణపై జాతీయ పార్టీల ముసుగులో దండుపాళ్యం ముఠా, గజదొంగల కన్నుపడింది. ఏ చిన్న సందు దొరికినా రాబందుల్లా వాలిపోయి పీక్కొని తినేందుకు సిద్ధంగా ఉన్నాయి.*

ఎన్నికల నగారా మోగిన మరుక్షణమే రకరకాల వేషాలు, తాయిలాలతో జాతీయ పార్టీల దండు రాష్ట్రంలో కలియతిరుగుతున్నది. తెలంగాణ నడిబొడ్డునున్న హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై అసూయతో వారంతా రగిలిపోతున్నారు. పొరుగు రాష్ట్రానికి గవర్నర్‌గా పని చేసిన ఒక జాతీయ పార్టీ సీనియర్ నేత హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిని చేస్తే బాగుంటుందని తన మనసులో మాట బయటపెట్టారు. వాస్తవానికి ఈ సలహా వెనుక ఆ పార్టీ కేంద్ర నాయకత్వం కచ్చితంగా ఉంటుంది. కాంగ్రెస్ కూడా మాయమాటలు చెప్పి రాష్ట్రంలో పాగా వేయాలనుకుంటున్నది. కల్లబొల్లి కబుర్లు చెబుతున్న మతతత్వ కాషాయం, మసకబారిన ఖద్దరు పార్టీలకు బుద్ధి చెప్పకపోతే తెలంగాణ ఉనికిని కోల్పోయే ప్రమాదమున్నది.

తెలంగాణ ఆత్మ హైదరాబాద్. ఆత్మలేని తెలంగాణ వద్దని 2014కు ముందే కరాఖండిగా అప్పటి టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ తెగేసి చెప్పారు. అన్ని మౌలిక సదుపాయాలతో అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ విస్తరించేలా బహుముఖ ప్రణాళికలతో సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లుగా చర్యలు తీసుకున్నారు. గొప్పగా తీర్చిదిద్దుకున్న హైదరాబాద్‌తో కూడిన తెలంగాణను కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌కు అండగా ఉండి కాపాడుకుందాం.

... కేవీఎన్ ఇంద్ర



ఎన్నికల అధ్యాయంలో నామినేషన్ల పర్వం నేటి నుంచి మొదలవుతున్నది. క్యాడర్ నుంచి లీడర్ వరకు అందరిలోనూ ఒకటే టెన్షన్. నామినేషన్ దాఖలు చేయడానికి సుముహూర్తం ఎప్పుడు అని ఆరాలు తీయడం మొదలైంది. కొందరు ఇప్పటికే శుభ ముహూర్తం నిశ్చయించుకోగా, మరికొందరు పురోహితుల దగ్గరికి క్యూ కడుతున్నారు. ముహూర్త బలంతో ప్రత్యర్థి చిత్తవ్వాలని, రికార్డు మెజారిటీ సిద్ధించాలని కోరుతూ బలమైన యోగంతో కూడుకున్న ముహూర్తం ఖరారు చేయాల్సిందిగా పండితులను ఆశ్రయిస్తున్నారు.

# ముహూర్తం ఎప్పుడు?

## నేటి నుంచి నామినేషన్లు షురూ

**మంచి రోజులు చూసుకుంటున్న లీడర్లు .. తారాబలమే ప్రధానం అంటున్న పండితులు**

*ఎవరి సెంటిమెంట్లు వారివి. ఎవరి అదృష్టం వారిది! ఎన్నికల సమరంలో ఓటరు కన్నా ముందుగా నాయకుణ్ని అనుగ్రహించాల్సింది పురోహితుడే! ఆయన గట్టి ముహూర్తం చూస్తే సగం విజయం సాధ్యమైనట్టే అని బలంగా నమ్ముతారు కొందరు నాయకులు. బీ ఫామ్ అందుకోవడం మొదలుకొని నామినేషన్ పత్రాలపై సంతకం పెట్టే వరకు శుభ ఘడియలు చూసుకోవడం రివాజు. ప్రధాన పార్టీలన్నీ దాదాపు అభ్యర్థులను ప్రకటించడంతో నామినేషన్ దాఖలుకు తమ జన్మ నక్షత్రానికి సరిపడే శుభ ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు.*




**తిథి.. వారం.. నక్షత్రం..**

**ఎన్నికల** కమిషన్ ప్రణాళిక ప్రకారం ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన్ల పర్వానికి తెర లేవనున్నది. నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నది. ఈ ఎనిమిది రోజుల్లో అందరికీ అన్నీ బాగుంటాయి అనుకుంటే పొరపాటే. తిథి బాగుంటే నక్షత్రం కుదరకపోవచ్చు. నక్షత్రం క్షేమకరమైనది అయినా.. వారం కుదరకపోవచ్చు. తిథి, వారాలు కుదిరినా.. యోగం సరిపడేది ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో బలమైన ముహూర్తం చూసే పండితులు ఎక్కడ ఉన్నారో వెతికి పట్టుకునే పనిలో అభ్యర్థుల అనుచరులు బిజీగా ఉన్నారు. పక్కరాష్ట్రాల జ్యోతిష్యులను సంప్రదిస్తున్నారు. పార్టీలకు అతీతంగా ఈసారి అభ్యర్థుల అదృష్టం బాగుండటంతో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ జరిగే సమయంలో సుముహూర్తాలు దండిగా ఉన్నాయి. సాధారణంగా ఆషాడం, భాద్రపదం, పుష్య మాసాల్లో ఎన్నికలు తటస్థిస్తే ముహూర్తాలకు కరువొచ్చి పడేది. నామినేషన్ దాఖలుకు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులో ఆశ్వయుజ మాసం ఉండటంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ నెలలో పెండ్లి ముహూర్తాలు కూడా ఎక్కువగానే ఉండటంతో... తమ నామినేషన్ వేసే శుభ సమయానికి ఢోకా ఉండదని అభ్యర్థుల నమ్మకం.

**ఎనిమిది రోజుల్లో..**

**నామినేషన్ల** ప్రక్రియ మొదలయ్యే మూడో తేదీన ఆశ్వయుజ బహుళ షష్ఠి ఉంది. వారం విశేషంగా ఉన్నా.. తిథి ఓ మోస్తరుగా ఉండటంతో ఆ రోజు నామినేషన్లు తక్కువగా నమోదు కావొచ్చు. 4వ తేదీ బలంగా ఉంది. సప్తమి తిథి, శనివారం, పుష్యమి నక్షత్రం కలిసి రావడంతో ఆ రోజు రిటర్నింగ్ అధికారులకు పని ఒత్తిడి ఎక్కువగానే ఉండే అవకాశాలు ఉన్నాయి. 5, 6 తేదీలు అష్టమి, నవమి తిథులు. వీటికి పెద్దగా డిమాండ్ ఉండకపోవచ్చు. ఏడో తేదీ మంగళవారం కావడంతో ప్రత్యేక ముహూర్తాలు పెట్టుకున్న వాళ్లు మినహా నామినేషన్ దాఖలు చేసే ధైర్యం సామాన్యంగా ఎవరూ చేయరు. ఎనిమిదో తేదీ తిథి, వారం బాగున్నా.. పూర్వఫల్గుణి నక్షత్రం ఉండటంతో ఆ రోజూ అంతంతమాత్రమే అంటున్నారు పండితులు. తొమ్మిదో తేదీ గురువారం ఏకాదశి కావడం, రాజకీయ కారకుడైన రవి నక్షత్రమైన ఉత్తర నక్షత్రం ఉండటంతో ఆ రోజు నామినేషన్ దాఖలుకు సరైనదని పండితులు విశ్లేషిస్తున్నారు. తొమ్మిది సంఖ్య కూడా అదనపు బలాన్ని చేకూరుస్తుందని చెబుతున్నారు. చివరి రోజు కూడా హస్త నక్షత్రం ఉండటంతో ఆ రోజు కూడా నామినేషన్లు దండిగానే నమోదవుతాయని అంటున్నారు పండితులు.

... కడార్ల కిరణ్

**తారాబలం ప్రధానం**

**ఏ పని చేసినా తారాబలం ప్రధానం అంటారు పెద్దలు. నామినేషన్ దాఖలుకు కూడా ముందుగా కలవాల్సింది అదే! రాజకీయం, వివాహం, ఉద్యోగం తదితర విషయాల్లో తారాబలం కలిస్తేనే జయం కలుగుతుందని పండితుల ఉవాచ. ఏ దోషాలూ లేని ముహూర్తాలు కుదరడం అరుదు. అయితే, చిన్నాచితకా దోషాలున్నా.. చట్టంలో సవరణలు ఉన్నట్టు.. తారాబలం ప్రశస్తంగా ఉంటే పనికొస్తుందని చెబుతున్నారు జ్యోతిష్యులు.**



# ఐటీలో సాటి లేదు..

## ఉద్యోగ కల్పనలో 143 శాతం పెరుగుదల

*తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఐటీ రంగ ముఖచిత్రమే అమాంతంగా మారిపోయింది. ఇప్పటివరకు జరిగిన ఐటీ ఉద్యోగాల్లో 143 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న సులభతరమైన, పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికా విధానాలే ఇంతటి మార్పునకు కారణమని ఐటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.*




**తొమ్మిదేండ్లలో ఐటీ ఉద్యోగాల్లో మార్పు ఇదీ**

2014
3,71,774
2023
9,05,715

పెరుగుదల
143%

తెలంగాణ ఏర్పడకముందు ఐటీ అంటే బెంగళూరు పేరే వినిపించేది. ప్రస్తుతం ఐటీ ఇండస్ట్రీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. ఐటీ, ఐటీఈఎస్ కార్యకలాపాల కోసం వినియోగించే ఏ గ్రేడ్ ఆఫీసు స్పేస్ లీజింగ్‌లోనూ హైదరాబాద్ బెంగళూరును మించిపోయింది. ఇదంతా తెలంగాణ ప్రభుత్వ విధానాలు, పనితీరు వల్లేనని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ సమగ్ర కార్యాచరణ విధానాల వల్ల ఐటీ ఉద్యోగావకాశాలు 24 శాతం వృద్ధి చెందాయి. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో స్థానం పొందిన 20కి పైగా బహుళజాతి కంపెనీలు (ఎంఎన్‌సీ) హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి.




విశేషం: దేశంలోని మొత్తం ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం వాటా తెలంగాణదే. టాప్-5 గ్లోబల్ టెక్ కంపెనీలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. బెంగళూరును కాదని హైదరాబాద్‌లో ఉద్యోగాల కోసం నెలకు 10 వేల మంది టెక్ ఉద్యోగులు లొకేషన్ షిఫ్ట్‌కు అప్లై చేస్తున్నారు. మౌలిక వసతులు, లివింగ్ కాస్ట్ తదితర అంశాలే కారణంగా పలువురు చెబుతున్నారు.

ఏరియల్ వ్యూ: బోధన్

# చివరి మడికీ సాగర్ నీళ్లు

- **రూ.77 కోట్లతో నిజాంసాగర్ కాల్వల ఆధునీకరణ**
- **చెరువుల్లో పూడికతీత, మరమ్మతుకు రూ.60 కోట్లు**
- **బోధన్ అభివృద్ధిలో ఎమ్మెల్యే షకీల్ ప్రత్యేక ముద్ర**



(బోధన్, నమస్తే తెలంగాణ)

**బహుభాషలు, వివిధ సంస్కృతుల సమ్మేళనంతో మినీ ఇండియాగా కనిపించే బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. తెలంగాణ ఏర్పడ్డాక ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. 2014, 2018 ఎన్నికల్లో షకీల్ విజయం సాధించారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి పోటీ చేస్తున్నారు.**



**రూ.500 కోట్లతో రోడ్ల విస్తరణ**

బోధన్ నియోజకవర్గంలో. సుమారు రూ.500 కోట్లతో రోడ్ల విస్తరణ, భవనాలు, వంతెనల నిర్మాణ పనులను చేపట్టారు. బోధన్ నుంచి సాలూర చెక్‌పోస్ట్ వరకు ఉన్న అంతర్రాష్ట్ర ప్రధాన రహదారిని రూ.10 కోట్లతో ఫోర్‌లేన్ గా విస్తరించారు. బోధన్ బైపాస్ రోడ్డును రూ.10 కోట్లతో ఆధునీకరించారు. బోధన్ నుంచి మోస్రా రోడ్డు, పెగడాపల్లి నుంచి ఫకీరాబాద్ రోడ్డు... ఇలా అనేక ప్రధాన రహదారులను ఆధునీకరించారు. లోలెవల్ వంతెనలతో ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి హై లెవల్‌కు మార్చారు. రెంజల్ వద్ద మొండివాగు, బోర్గాం, బ్రాహ్మణ్‌పల్లి, నవీపేట్ మండలంలోని జన్నేపల్లి, బోధన్ మండలంలోని కొప్పర్గ తదితర వంతెనలను నిర్మించారు. జాన్కంపేట్ నుంచి బాసర వరకు రూ.50 కోట్లతో రోడ్డును విస్తరించారు.

**ఆయకట్టుకు సాగునీరు..**

రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.77 కోట్లతో నిజాంసాగర్ కాల్వలను ఆధునీకరించారు. దీంతో చివరి ఆయకట్టు వరకూ నీరు అందుతున్నది. భూగర్భ జలాలు పెరిగేందుకు రూ.26 కోట్లతో ఆరు చెక్‌డ్యాంలను నిర్మించారు. 'మిషన్ కాకతీయ' కింద రూ.60 కోట్లతో చెరువులల్లో పూడికను తీసి కట్టలను బలోపేతం చేశారు.

> సంక్షేమ పథకాల అమలులోనూ షకీల్ తనదైన ముద్ర వేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 2016–17 నుంచి ఇప్పటి వరకు 11,596 కుటుంబాలకు ప్రయోజనం కల్పించారు.

వైద్య, ఆరోగ్య సేవలను మెరుగుపర్చడానికి ఎమ్మెల్యే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చారు. బోధన్‌లోని కమ్యూనిటీ దవాఖానను 250 పడకలకు విస్తరించారు.

**పేద విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు బోధన్‌లో ఆరు గురుకులాలను ఏర్పాటు చేయించారు. పలు పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయించారు. బోధన్, రెంజల్, అమ్దాపూర్‌లల్లో జ్యోతిరావు బాపూలే బాలికల పాఠశాలలు నెలకొల్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని రూ.6 కోట్లతో ఆధునీకరించారు. రూ.3.5 కోట్లతో నవీపేట్‌లో పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని నిర్మించారు.**

# పోలీస్ కమాండర్!

దేశంలో మొట్టమొదటి పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్






*రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యమిస్తున్న సీఎం కేసీఆర్ నగరంలో 'పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2015లో నిర్మాణం ప్రారంభించి, 6.42లక్షల చదరపు అడుగుల్లో 20 అంతస్తులతో అత్యాధునిక వసతులతో ఈ టవర్‌ను నిర్మించింది బీఆర్ఎస్ సర్కార్. ఇందుకోసం రూ.585 కోట్లు ఖర్చుచేసింది. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని లక్షకుపైగా సీసీ కెమెరాలను వీడియో వాల్‌పై వీక్షించవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు, మరేదైనా విపత్తులు సంభవించినప్పుడు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, సెక్రటరీలు, మంత్రులు ఇక్కడి నుంచే రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తారు.*

*-ఎలక్షన్ డెస్క్, నమస్తే తెలంగాణ*

## న్యాయం గెలిచింది

> *న్యాయవాదులు బాగా సంపాదిస్తరని చానామంది అనుకుంటరు. నిజం అట్లుండది. వందల పది మందికె మస్త్ పైసలొస్తయ్. మిగతా తొంబైమందిది పేద బతుకే. ఈ లాయర్ల పేద బతుకు గురించి ఇంతకముందు ఏలినోళ్లు పట్టించుకోలే. కేసీఆర్ వచ్చినంకనే మా బతుకు మారింది.*

లాయర్ల పేదరికాన్ని అర్థం చేసుకుని, వాళ్లకు సాయం జేయాల్నని తెలంగాణ గవర్నమెంట్ మా కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసింది. లాయర్లకు హెల్త్ కార్డులు ఇచ్చిన్రు. కరోనా వచ్చినప్పుడు చానా ఇబ్బంది పడ్డ. ఆ టైమ్‌ల కోర్టులు నడువలె. ఆదాయం లేకుండె. దవాఖానల జేరితే ఉన్న డబ్బులన్నీ అయిపోయినయ్. అప్పుడు హెల్త్ కార్డు ఆదుకున్నది. నేను బతికి బయటపడ్డ. నేనే గాదు నాలాంటి లాయర్లెంతోమందికి ఈ హెల్త్ కార్డు మేలు చేసింది. ఏదన్నా పెద్ద రోగమొస్తె ఏడాది సంపాదన దవాఖానకే పోతుండె. ఇప్పుడట్ల లేదు. నలుగురు లాయర్లకు పెద్ద జబ్బు వస్తే, యాక్సిడెంట్ అయితే ఆపరేషన్‌కు కార్డు అక్కరకొచ్చింది. లాయర్లలో పేదలుంటరని, వాళ్లని పట్టించుకోవాల్నని పెద్ద మనసుతోని కేసీఆర్ దేశంలనే ఆదర్శవంతమైన పథకాన్ని ప్రవేశపెట్టిండు. మేము కృతజ్ఞతలు చెప్పుడే కాదు ఎప్పటికీ రుణపడి ఉంటం.



**- నాటకశాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్**

## పేదల ఆరాధ్య దైవం కేసీఆర్

> **బీఆర్ఎస్ సర్కార్ పుణ్యమాని ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలలో పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం అందుతున్నది. ఉచిత వైద్యంతోపాటు మందులను కూడా అందజేస్తుండడంతో పేదోళ్లకు ఎంతో మేలు జరుగుతున్నది.**

గిన్ని బస్తీ దవాఖానలు వస్తయని ఎవ్వరం అనుకోలేదని, ముఖ్యంగా బీపీ, షుగర్, క్యాన్సర్ లాంటి వ్యాధులకు కూడా బస్తీ దవాఖానల్లో చూస్తున్రు. ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి క్యాన్సర్ రోగులను గుర్తించి మందులను ఇస్తున్రు. 'టిమ్స్ పేరుతో అల్వాల్‌లో పెద్ద దవాఖానను కడుతున్నరు. అది పూర్తయితే ఇగ ప్రైవేటు దవాఖానలకు పోవుడు పూర్తిగా తప్పుతది'. అద్భుతమైన కంటి వెలుగు పథకం అమలు చేసి సీఎం కేసీఆర్ కంటి వెలుగైండు. నూటికి నూరు శాతం కంటి సమస్యలు తీరినయ్. కేసీఆర్ కిట్ నుంచి ఆసరా పింఛన్ల వరకు అనేక మందికి బీఆర్ఎస్ సర్కార్ అండగా నిలుస్తున్నది. లెక్కకు మించిన సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు ఆరాధ్య దైవంగా మారిండు.



**-ఆస శ్రీరాములు,వెంకటాపూర్, అల్వాల్**


సోషల్ యాంగిల్




### ఫ్రీ బస్సులు ఎందుకంటే..

*కర్ణాటకలో తమకు ఫ్రీ బస్సులు ఎందుకోసం పెట్టారో మహిళలకు మొదట తలలు బాదుకున్నా అర్థం కాలేదు. కాంగ్రెస్ ప్రకటించిన అయిదు గ్యారంటీల అమలు కోసం ఆఫీసుల చుట్టూ ఎలాగూ చక్కర్లు కొట్టక తప్పదన్న ముందుచూపుతో ఏర్పాటుచేసి ఉంటారు. తమ ఫ్రీ హామీల కోసం బస్‌చార్జీలు పెట్టుకొని మరీ తిరగాల్సి వస్తుందని మహిళలు ఎక్కడ శాపనార్థాలు పెడుతారేమోనన్న భయంతోనే ఫ్రీ జర్నీ పథకం పెట్టారని కన్నడ వనిత పసిగట్టింది. మొత్తం మీద కాంగ్రెస్ హామీలను కర్ణాటక మహిళలు అర్థం చేసుకున్నంత బాగా ఇంకెవరూ అర్థం చేసుకోలేరేమో!*

-వెల్జాల




### బీజేపీ పదనిసలు

*ఈటల రాజేందర్‌ని, రాజేందర్ మాదిగ, రాజేందర్ నాయక్ అని అన్ని కులాలు పిలుచుకుంటాయట. అయితే, అతడు తన కుమారుడికి మాత్రం 'నితిన్ రెడ్డి' అని పేరు పెట్టుకున్నాడు.*

*రాజా సింగ్‌ని ఎందుకు సస్పెండ్ చేశారు? అతడిలో ఏ పరివర్తన చూసి సస్పెన్షన్ ఎత్తేశారనేది మానవ మాత్రుడికి ఏమాత్రం అర్థంకాని విషయమని, అది పార్టీ ఎత్తుగడ మాత్రమేనని అందరికీ తెలిసిన విషయమే.*

*'బీసీల కులగణన దేశ విభజన'' అని ప్రకటించిన ప్రధాని, ఎమ్మెల్యే టికెట్లు ఇస్తానంటే నాయకులు తిరస్కరిస్తున్న చోట బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడం ఒక మోసకారి ఎత్తుగడ మాత్రమే.*

- సిద్ధార్థ సుభాష్‌చంద్రబోస్